క్లుప్తంగా

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



వైభవ వేంకటేశ్వరస్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ తెలిపారు. తెల్లవారు జామున సన్నిధిగొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. 7.30గంటలకు బాలభోగం, 9.30గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి, 10గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30గంటలకు రాజభోగనివేదన ఉంటుంది. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా భక్తులకు అన్నసమారాధన చేస్తారు. సాయంత్రం నక్షత్ర హారతి, కర్పూర హారతి, కూష్మాండ హారతి, కుంభ హారతి ఇస్తారు.

బాక్సింగ్ విజేతలకు అభినందన



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం లక్ష్మీనరస, సునంద్

సీతంపేట: ఇటీవల అసోంలో జరిగిన ఆర్‌ఈసీ కంబైన్డ్ నేషనల్ టాలెంట్ హంట్ బాక్సింగ్ పోటీల్లో 26వ వార్డు అక్కయ్యపాలెం జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు పతకాలు సాధించారు. సాయ్ అకాడమిలో శిక్షణ పొందుతున్న బి. నిహారిక సబ్ జూనియర్ విభాగంలోబంగారు పతకం సాధించింది. అలాగే కె.గ్రీష్మిత బ్రాంజ్ మెడల్ సాధించింది. వీరిద్దరిని పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనరస, పీడీ సునంద్, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

రైతుబజారు స్టాళ్లకు డ్రా



డ్రా తీసిన స్టాల్ కేటాయిస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజారులో శుక్రవారం రైతుల స్టాళ్లకు డ్రా తీశారు. ఉదయం 92 మంది, సాయంత్రం మంది రైతులకు డ్రా తీసి రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు స్టాళ్లు కేటాయించారు. ఈ సందర్భంగా ఎస్టేట్ అధికారి కొండబాబు మట్లాడుతూ మార్కెటింగ్ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ప్రతి వారం రైతుల స్టాళ్లకు సంబంధించి రైతులకు డ్రా తీస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సహాయకుడు సతీష్ పాల్గొన్నారు.

వైభవంగా రాట మహోత్సవం



క్షేమకాళీ పంచరాత్రి మహోత్సవాల రాట కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాహకులు, భక్తులు

తాటిచెట్లపాలెం: రైల్వేన్యూకాలనీ జంక్షన్ వద్ద రైల్వేన్యూకాలనీ వర్తక సేవా సంఘం ఆధ్వర్యంలో క్షేమకాళీ మహోత్సవాలకు సంబంధించిన రాట కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 31 నుంచి నవంబరు 4వ తేదీ వరకు రైల్వే న్యూకాలనీ జంక్షన్ వద్ద క్షేమకాళీ పంచరాత్రి మహోత్సవాలు, 15వ వార్షికోత్సవ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు.31న ప్రత్యేక పూజలు, హోమాలు, నవంబరు 2న భారీ అన్నదానం, 4న అంగరంగ వైభవంగా ఊరేగింపు నిమజ్జన కార్యాక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. రాటమహోత్సవ కార్యక్రమంలో దాడి శ్రీనివాసరావు, దువ్వి కాశీప్రసాద్, బ్రహ్మాజీ, రాపేటి శ్రీను, రాజత్ కాంతి ధర, రూపాలి ధర, సుబ్బు పోలెయ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడి.. సమస్యల సుడి

నియోజకవర్గంలోని అతిపెద్ద పాఠశాలల్లో ఇదీ ఒకటి. నగరం నడిబొడ్డున చక్కని భవనం, విశాలమైన మైదానం ఈ స్కూల్ సొంతం. ఆ సర్కారు బడిలో ఏటా 1,000 మంది వరకు విద్యార్థులు చదువుతారు. ప్రస్తుతం విద్యార్థులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ఇరుకు గదులు, తాగునీటి సమస్య, బెంచీలు సైతం సరిపోక నేలపైనే కూర్చోవాల్సి వస్తోందని స్టూడెంట్లు వాపోతున్నారు. సీతమ్మధార పీ అండ్ టీ కాలనీలోని గ్రేటర్ విశాఖ నెహ్రూ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల దుస్థితి ఇది.



పీ అండ్ టీ కాలనీలోని ఎన్‌ఎంసీ హైస్కూల్

- ఎన్‌ఎంసీ హైస్కూల్‌లో ఇరుకు గదులతో అవస్థలు
- చాలీచాలని బెంచీలు, తాగునీటికి కటకట
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని విద్యా శాఖ అధికారులు

సీతమ్మధార: విశాఖను స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తున్న జీవీఎంసీ పర్యవేక్షణలో నడుస్తున్న ఎన్‌ఎంసీ హైస్కూల్‌ను ఎన్నో ఏళ్లుగా వసతి సమస్య పీడిస్తోంది. ఈ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు సుమారు 918 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్మీడియట్ కూడా ప్రారంభించడం తెలిసిందే. ఇంటర్‌లో మరో 57 మంది విద్యార్థులు ఉన్నారు. సీతమ్మధార, నక్కవానిపాలెం, ఆరిలోవ, మద్దిలపాలెం, ఇసుకతోట, వెంకోజీపాలెం తదితర ప్రాంతాలకు చెందిన పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. ఇక్కడ మొత్తం 17 వరకు తరగతి గదులున్నాయి. వాటిలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, స్టోర్ రూమ్, వంటగది కోసం కొన్ని గదులు కేటాయించారు. పాఠశాలలో హెచ్‌ఎం సహా 30 మంది టీచర్లు విద్య బోధిస్తున్నారు. వీరిలో 24 మంది మహిళా ఉపాధ్యాయులు ఉన్నారు.

ఇవీ సమస్యలు..

- ఏటా ఈ పాఠశాలలో సుమారు 250 మంది కొత్త విద్యార్థులు చేరుతుంటారు. ఇంతటి డిమాండ్ ఉన్న స్కూల్‌లో వసతులు కల్పించడంలో జీవీఎంసీ ఘోరంగా విఫలమవుతోందని తల్లిదండ్రులు మండిపడుతున్నారు.
- వర్షం పడితే చాలు పాఠశాల మైదానం బురదతో నిండిపోతుంది. విద్యార్థులు నడిచేందుకు కూడా వీలు లేకుండా మారుతుంది.
- సాధారణంగా ఒక్కో తరగతి గదిలో 40 మంది విద్యార్థులు ఉండాలి. ఈ పాఠశాలలో మాత్రం ఒక్కో గదిలో ఏకంగా 60 నుంచి 70 మంది విద్యార్థులు ఉండటం గమనార్హం.
- కొన్ని గదుల్లో బెంచీలు ఏర్పాటు చేసే వీలు లేక విద్యార్థులు నేలపైనే కూర్చుంటున్నారు. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థులపై దృష్టి సారించలేని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా చదువులో వెనుకబడిన విద్యార్థుల మీద టీచర్లు అంతగా దృష్టి పెట్టలేకపోతున్నారని తల్లిదండ్రులు మదనపడుతున్నారు.



బెంచీలు సరిపోక నేలపైనే కూర్చున్న విద్యార్థులు

- వాష్‌రూమ్‌లు అరకొరగా ఉండటంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.
- పాఠశాల మొదటి అంతస్తులోని ఒక హాల్ ఏడాదిగా నిరుపయోగంగా ఉన్నా.. అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఈ గదిలో కంప్యూటర్ టేబుళ్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్స్ దుమ్మూ ధూళి పట్టి వృథాగా పడి ఉన్నాయి.
- ఈ గదిని వినియోగంలోకి తీసుకొస్తే 200 మంది విద్యార్థులకు వసతి కల్పించవచ్చు.
- పాఠశాల విద్యా కమిటీ ఈ విషయమై అంతగా దృష్టి సారించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యా శాఖ అధికారులు స్పందించి పాఠశాల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

దాహం కేకలు

ఎన్‌ఎంసీ హైస్కూల్ ప్లస్‌లో విద్యార్థులు తాగు నీటికి అవస్థలు పడుతున్నారు. దాదాపు 1,000 మంది వరకు విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. వారికి పాఠశాలలో సరైన తాగునీటి సదుపాయం లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ కుళాయి నీరు, బోరు నీరు వస్తున్నా భద్రపరిచే యంత్రాంగం లేకపోవడంతో పిల్లలకు దాహం కేకలు తప్పడం లేదు. వాటర్ ట్యాంక్ లీకేజీ కారణంగా మంచినీరు వృథా అవుతోంది. కొంతమంది స్టూడెంట్లు ఇళ్ల నుంచి నీరు తెచ్చుకుంటున్నా సాయంత్రానికి అయిపోతే పాఠశాలలో చుక్క తాగునీరు కరువవుతోందని ఆందోళన వ్యక్తమవుతోంది. జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం ఇంజినీర్లు స్పందించి పాఠశాలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



పాఠశాలలో కుళాయి నుంచి నీరు రాక ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

బ్యాంక్ మేనేజర్ దయాకర్‌పై చర్యలకు డిమాండ్



మాట్లాడుతున్న బాధితులు చౌదరి, శ్రీకాంత్

సీతంపేట: హార్బర్ ఏసీపీ సస్పెన్షన్‌లో ప్రమేయం ఉన్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ జి.దయాకర్‌పై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ఆయన చేతిలో మోసపోయిన ఖాతాదారుడు అంకమ్మ చౌదరి డిమాండ్ చేశారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దయాకర్ గుంటూరు బ్రాంచిలో మేనేజర్‌గా పని చేస్తున్న సమయంలో 2019లో అతని స్నేహితుడు పెనుమోలు చిన్నాకు నాలుగు దఫాల్లో రూ.7.30 లక్షలు అప్పుగా ఇచ్చానని తెలిపారు. నెలలు గడిచాక తన సొమ్ము తిరిగి ఇవ్వాలని చిన్నాను కోరగా.. 2020 జూలైలో రూ.4 లక్షలకు చెక్ ఇచ్చాడని, బ్యాంకులో డిపాజిట్ చేయగా క్యాష్ అవ్వకుండా చిన్నాతో కలిసి దయాకర్ డెస్ట్రాయ్ చేశారన్నారు. తన ఖాతా నుంచి రూ.3 లక్షలు బ్యాంకులో పనిచేసే పి.రాజేశ్వరికి తన అనుమతి లేకుండా బదిలీ చేశారన్నారు. దయాకర్ వ్యవహారంపై బ్యాంకు డీజీఎంకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈక్రమంలో చిన్నా చేత తనపై రివర్స్ కేసు పెట్టించారన్నారు. తర్వాత దయాకర్‌కు వన్‌టౌన్‌లోని యూనియన్ బ్యాంక్‌కు బదిలీ అయ్యిందని, హార్బర్ ఏసీపీ మోజెస్‌పాల్ చేత తనపై, మరో బాధితుడు దళితుడు శ్రీకాంత్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయించారని చెప్పాడు. లంచం తీసుకుని తమపై ఉన్న కేసు తొలగించకపోవడంతో సీపీకి, డీజీపీకి ఫిర్యాదు చేశామని, దాంతో ఏసీపీ సస్పెండ్‌కు గురైనట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో దయాకర్‌పై చర్యలు తీసుకోవాలని బాధితులు అంకమ్మ చౌదరి, శ్రీకాంత్ కోరారు.

జీఎస్టీ ఇన్‌స్పెక్టర్లకు ముగిసిన శిక్షణ

సీతంపేట: అక్కయ్యపాలెం నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్(ఎన్‌ఏసీఐఎన్) కార్యాలయంలో కొత్తగా నియమితులైన జీఎస్టీ ఇన్‌స్పెక్టర్లకు 14 వారాల ఇండక్షన్ ట్రైనింగ్, పన్ను సహాయకులకు మూడు వారాల ఇండక్షన్ ట్రైనింగ్ పూర్తయిన సందర్భంగా శుక్రవారం ముగింపు సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గోపీనాథ్ జట్టి మాట్లాడుతూ ఇన్‌స్పెక్టర్లు పన్ను అధికారులు వారి పాత్రను అర్థం చేసుకోవాలన్నారు. క్రమశిక్షణ పెంపొందించుకోవాలని, ఎల్లప్పుడూ నేర్చుకునే రీతిలో ఉండాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులకు శిక్షణ నివేదికలు అందజేసి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. డిమాండ్ అండ్ అడ్జుడికేషన్ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అకడమిక్, స్పోర్ట్స్ యాక్టివిటీస్‌లో ప్రతిభ చూపిన అధికారులకు జ్ఞాపికలు అందించారు. ఎన్‌ఏసీఐఎన్ అదనపు డైరెక్టర్ జనరల్ రవికిరణ్ ఈదర శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులను అభినందించారు. శిక్షణ సమయంలో నేర్చుకున్న నైపుణ్యాలను ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం ట్రైనీ అధికారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



ముగింపు సమావేశంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గోపీనాథ్ జట్టీ

ఉత్సాహంగా క్విజ్ పోటీలు

సీతంపేట: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు శుక్రవారం పౌరగ్రంథాలయంలో క్విజ్ పోటీ నిర్వహించారు. వర్తమాన అంశాలతో పాటు గ్రూప్ 2 సిలబస్ ఆధారంగా వివిధ సబ్జెక్టులపై పోటీ జరిగింది. 70 మంది విద్యార్థులు ఎనిమిది బృందాలుగా పాల్గొన్నారు. ఎనిమిది రౌండ్లలో జరిగిన పోటీల్లో విజేతలకు పుస్తకాలు ప్రదానం చేశారు. గ్రంథాలయ సహ కార్యదర్శి డాక్టర్ డి.వి. సూర్యారావు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు. గ్రంథపాలకురాలు దుర్గారాణి పర్యవేక్షించారు.



పౌరగ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహిస్తున్న మాస్టర్ డి.వి.సూర్యారావు

24వ వార్డులో అన్నసమారాధన



వడ్డన చేస్తున్న కర్రి మురళీకృష్ణారెడ్డి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు పరిధి రేసపువానిపాలెం లోని శ్రీ శాంతిస్వరూపిణి దుర్గా అమ్మవారి ఆలయ ఆవరణలో శుక్రవారం కేఎన్‌ఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ట్రస్టు అధ్యక్షుడు కర్రి మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిరుపేదలు, అయ్యప్పస్వామి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతి వారం ఇక్కడ అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కె. .సత్యనారాయణరెడ్డి,కె.సీతయ్యమ్మ కె.సుబ్బలక్ష్మి, ఆలయ కమిటీ అధ్యక్షుడు గురునాథ్‌రెడ్డి, సెక్రటరీ బాచీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేతో తహసీల్దార్ భేటీ

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ ఎం.రమేష్ శుక్రవారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్యే పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయంలో తాగునీటి కొరత ఉందన్నారు. కార్యాలయ ఆవరణలో పెట్రోల్ బంక్ మంజూరైందని, ఇందుకుగాను దుకాణం ఆటంకంగా ఉదని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా రెవెన్యూ శాఖ స్థలంలో ఆక్రమణలు ఉండటంతో సమస్యగా ఉందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ, జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి బోరు వేయిస్తామని హామీ ఇచ్చారు. పెట్రోల్ బంక్ ఏర్పాటుకు గాను దుకాణం తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ స్థలంలోని ఆక్రమణలను జోన్–3 టౌన్ ప్లానింగ్ అధికారుల ద్వారా తొలగించేలా జోనల్ కమిషనర్‌తో చర్చిస్తానని చెప్పారు.

ఘనంగా మార్లోన్ బ్రాండో శతజయంతి



మార్లోన్ బ్రాండో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు

సీతంపేట: ప్రముఖ హాలీవుడ్ నటుడు ది గాడ్‌ఫాదర్ హీరో మార్లోన్ బ్రాండో శతజయంతి ఉత్సవాల సందర్భంగా వైజాగ్‌ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో గాడ్‌ఫాదర్ (1972) సినిమాను ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ప్రదర్శించారు. ముందుగా మార్లెన్ బ్రాండో చిత్రపటానికి నివాళులర్పించారు. ఫిల్మ్ సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ దిగాడ్ ఫాదర్ సినిమా స్ఫూర్తితో హిందీ, తెలుగు సినీ రంగంలో ఎన్నో గొప్ప సినిమాలు వచ్చాయని తెలిపారు. సొసైటీ కార్యదర్శి బి. చిన్నారావు, ఉపాధ్యక్షులు కాశీ విశ్వేశ్వరరావు, ఆర్.శివకుమార్,రాంప్రభు, గణేశ్వర బాబ్జి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఇనార్బిట్ మాల్ ప్రతినిధులు

సీతమ్మధార: ఇనార్బిట్ మాల్ ప్రతినిధులు శుక్రవారం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మాల్‌లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.

అలరించిన కర్ణాటక వీణా కచేరీ



వీణా కచేరీ చేస్తున్న లక్ష్మీశ్రీనివాస్

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో శుక్రవారం సాయంత్రం జరిగిన కర్ణాటక వీణా కచేరీ ఆహుతులను అలరించింది. మల్లా ప్రగఢ జోగులాంబ శిష్యురాలు డాక్టర్ పి.వి.ఎస్.లక్ష్మీశ్రీనివాస్ వీణా వాదనతో భక్తులు, శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు. త్యాగరాజ, ముత్తుస్వామి దీక్షితార్ కీర్తలను మృదుమధురంగా వీణపై పలికించి అలరించారు. ఈమెకు టి.ఎస్.చైతన్య మృదంగంపై, ఆర్.శ్రీచరణ్ ఘటంపై వాద్య సహకారం అందించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ కళాకారులను ఘనంగా సత్కరించారు.

4 నెలలుగా వేతనాల్లేవ్..!

- ఎలా బతకాలని జీవీఎంసీ స్కూల్ సిబ్బంది ఆందోళన
- విద్యా శాఖ పట్టించుకోవాలని విజ్ఞప్తి



ఎన్‌ఎంసీ హైస్కూల్‌లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది

సీతమ్మధార: జీవీఎంసీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందికి నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. ఫలితంగా తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పీ అండ్ టీ కాలనీలోని గ్రేటర్ విశాఖ నెహ్రూ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో ఇద్దరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వాష్‌రూమ్‌లు శుభ్రం చేయడం వంటి విధులు నిర్వహిస్తుంటారు. ఈ పాఠశాల, కళాశాలలో దాదాపుగా 1000 మంది వరకు విద్యార్థులు, 30 మంది వరకు ఉపాధ్యాయులు ఉన్నారు. దీంతో ఇక్కడి వాష్‌రూమ్‌లు శుభ్రం చేయడం ఎంత కష్టంగా ఉంటుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ప్రతి నెలా వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ కష్టతరంగా మారిందని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర సరకుల ధరల భారం ఒకవైపు.. పాఠశాలలో వేతనాలు ఇవ్వకపోవడంతో పడుతున్న బాధలు మరో వైపు ఉండటంతో ఔట్ సోర్సింగ్ సిబ్బంది పడరాని పాట్లు పడుతున్నారు. వీరికి నెలకు రూ.6 వేల చొప్పున వేతనాలు చెల్లిస్తారు. ఇచ్చేదే తక్కువ వేతనం అనుకుంటే.. అది కూడా సకాలంలో ఇవ్వకపోవడం తీవ్ర దుమారం రేపుతోంది. ఒక్క నెల జీతం లేకపోవడం ఇబ్బంది అనుకుంటే.. నాలుగు నెలలుగా వేతనాలు లేక అప్పులు చేసి కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితి నెలకొందని అందోళన వ్యక్తమవుతోంది. వంట పనిచేసే మరో ఇద్దరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు రెండు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. వీరు రోజూ మధ్యాహ్నం గుడ్లు ఉడికించి విద్యార్థులకు వడ్డిస్తారు. జిల్లా విద్యా శాఖ అధికారులు స్పందించి తమకు వేతనాలు చెల్లించాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కోరుతున్నారు.

పోర్టు హాస్పటల్ ప్రైవేటీకరణకు

వ్యతిరేకంగా అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం: పోర్టు హాస్పటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహారదీక్షలు 25వ రోజుకు చేరాయి. దీక్షల్లో భాగంగా శుక్రవారం సీఐటీయూ నాయకులు అర్ధనగ్న ప్రదర్శనతో మోకాళ్లపై నిరసన తెలిపారు. సీటూ గౌరవాధ్యక్షుడు పద్మనాభరాజు మాట్లాడుతూ పోర్టు హస్పటల్ టెండర్ పేరుతో ఎవరు వచ్చినా అడ్డుకుని తీరుతామని హెచ్చరించారు. హాస్పటల్ టెండరు పేరిట ఎవరు వచ్చినా వారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఆలిండియా ఫెడరేషన్ కార్యదర్శి జగన్ మాట్లాడుతూ ప్రైవేటీకరణ నిర్ణయం అనైతికమని, హాస్పటల్ అభివృద్ధి కార్మికుల కృషితోనే సాధ్యమైందని, సుమారు 40వేల మంది కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రైవేటువారికి అప్పగించడం అన్యాయమని తెలిపారు. పోర్టు విశాఖపట్నం అభివృద్ధికి కీలకమని, ప్రతీ ఏడాది జీవీఎంసీకి పన్నుల రూపంలో సగటున రూ.55కోట్లు పన్నులు కడుతుందని, ఇలా ప్రైవేటుపరం చేయడం వల్ల విశాఖ ప్రగతికి ఆటంకంగా నిలుస్తుందన్నారు. పోర్టు హాస్పటల్ వద్ద రిజర్వు ఫండ్లు, వేల ఎకరాల భూములు ఉన్నప్పటికీ ప్రైవేటీకరణ చేయాలని తీసుకున్న నిర్ణయం అన్యాయమన్నారు., వెంటన ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోర్టు చైర్మన్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు సైతం సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. కార్యాక్రమంలో నాయకులు కె. సత్యనారాయణ, ఈశ్వర్రావు, బి. లక్ష్మణరావు, రామలింగేశ్వర్రావు, సీహెచ్ త్రినాథరావు, కేఎస్ కుమార్, శ్రీను, రాఘవులు, విజయారావు తదితరులు పాల్గొన్నారు.

అర్జునరావుకు ఘన నివాళి

సీతంపేట: శెట్టి బలిజల సంక్షేమానికి, అభివృద్ధికి విశేష కృషి చేసిన పంపన అర్జునరావు ప్రతి ఒక్కరికీ ఆదర్శం కావాలని దుర్గా వర్తక సంఘం గౌరవాధ్యక్షులు మట్టపర్తి నాగరాజు అన్నారు. అర్జునరావు సంస్మరణ సభ శుక్రవారం పౌరగ్రంథాలయం సమీపంలో జరిగింది. అర్జునరావు చిత్రపటానికి పలువురు శెట్టిబలిజ సంఘం నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం డిప్యూటీ సెక్రటరీ కట్టా మల్లేశ్వరరావు మాట్లాడుతూ శెట్టిబలిజ సంక్షేమ సంఘం భవన నిర్మాణంలో అర్జునరావు కీలకమైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. సంఘ నాయకులు గొడ్డు కన్నారావు, కుడుపూడి శ్రీనివాసరావు, సలీం శ్రీనివాసరావు, గుబ్బల దుర్గా ప్రసాద్, గండిబోయిన వెంకటరమణ, వలెవల వరప్రసాద్, బొక్క త్రిమూర్తులు , కడలి తాతారావు పాల్గొన్నారు.

'సాలూరి'కి స్వర నీరాజనం



సాలూరి రాజేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏసీపీ నరసింహమూర్తి తదితరులు

సీతంపేట: సినీ సంగీత దర్శకుడు సాలూరి రాజేశ్వరరావు 25వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం అక్కయ్యపాలెం స్వరాలయ స్టూడియోలో ఫ్యామిలీ మెలోడీస్ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో కోటి స్వరపర్చిన చిత్ర గీతాలతో నిర్వహించిన సంగీత విభావరి ఆద్యంతం అలరించింది. విశ్వప్రసాద్, కోమలి పాడిన ఒక పూల బాణం, శివనారాయణ, లక్ష్మి సాత్విక పాటిన గుమ గుమాయించు కొంచెం, శ్యాంసుందర్, రమాదేవి పాడిన చిలిపి నవ్వుల నిన్ను, రాంబాబు, పూర్ణిమ పాడిన ఉన్న మాట చెప్పలేవా, ఎస్ఎస్ఎస్ రాజు, కృష్ణవేణి పాడిన ప్రియా ప్రియతమా రాగాలు, ఎస్.ఎన్.రావు, అలేఖ్య పాడిన ఏ చోట ఉన్నా గీతాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ముందుగా నార్త్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ నార్ని నరసింహమూర్తి ముఖ్య అతిథిగా సాలూరి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు చెన్న తిరుమలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళా రంగ ప్రముఖులు కొణతాల రాజు, మెలోడి సత్యనారాయణ, సంస్థ అధినేతలు శివనారాయణ, విశ్వప్రసాద్ పాల్గొన్నారు.